క్లుప్తంగా

ఉపాధ్యాయ డైరీ ఆవిష్కరణ



ఉపాధ్యాయ డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: మండల ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన ఉపాధ్యాయ డైరీని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు ఆవిష్కరించారు. మంగళవారం మండలంలోని కత్తిమండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో డైరీ ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యే రాపాకను ఉపాధ్యాయులు సత్కరించారు. ఉపాధ్యాయులందరికీ ప్రయోజనం చేకూరేలా డైరీ రూపొందించి అందరికీ ఉచితంగా అందిస్తున్న ఎస్టీయూ నాయకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షులు తిక్కిరెడ్డి శ్రీనివాస్, కటకం రవి, ఆర్.మురళీకృష్ణంరాజు, అడబాల శ్రీనివాస్, పీఎస్ఎన్, ఎస్ఎస్ఎన్ఇ.ప్రభాకర్, ఈద వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు నిరుపమానం



పెదపట్నంలంకలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: వలంటీర్లు అందిస్తున్న సేవలు నిరుపమానమైనవని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం పెదపట్నంలంకలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో వలంటీర్లకు పురస్కారాలను అందించి వారిని సత్కరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుందని ఎమ్మెల్యే చిట్టిబాబు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో వారు అందిస్తున్న సేవలకు వెలకట్టలేమని చెప్పారు. గ్రామాల్లో వలంటీర్లకు ఉన్న గుర్తింపు ఉద్యోగులకు లేదన్నారు. అంతగా ప్రజల మనస్సుల్లో వలంటీర్లు చోటు దక్కించుకున్నారని అభినందించారు. ప్రస్తుత తరుణంలో వలంటీర్లు మరింత బాధ్యతగా పని చేయాలని చిట్టిబాబు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనిరెడ్డి అంజిబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు కొమ్ముల సూరిబాబు, రాయుడు ఆనంద్, జోగి వెంకటరామకృష్ణ, విప్పర్తి నాగేశ్వరరావు, కొమ్ముల వెంకటేశ్వరరావు, వేగిరాంబాబు, ఆకుమర్తి శ్రీను పాల్గొన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి గల్లంతు



నాగప్రసాద్ (ఫైల్)

మామిడికుదురు: పాశర్లపూడి వైనతేయ వారధిపై నుంచి దూకి కొమరాడకు చెందిన చెల్లింగి నాగప్రసాద్ (32) మంగళవారం గల్లంతయ్యాడు. బ్రిడ్జిపై బైక్ నిలిపి, జోళ్లు విడిచి పెట్టి అమాంతంగా నదిలో దూకేశాడని స్థానికులు చెప్పారు. గోదావరి నదిలో దూకి గల్లంతైన నాగప్రసాద్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నగరం ఎస్సై షేక్ జానీబాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న నాగప్రసాద్‌కు భార్య, ఎనిమిది నెలల కుమారుడు ఉన్నాడని చెబుతున్నారు. అతను నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ గొడౌన్‌లో హమాలీగా పని చేస్తాడని చెప్పారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఈఓ-2గా వెంకన్నబాబు



మామిడికుదురు: మండల ఎంఈఓ-2గా మోకా వెంకన్నబాబు నియమితులయ్యారు. ఆయన పి.గన్నవరం మండలం మానేపల్లి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ పదోన్నతిపై మండల ఎంఈఓ-2గా బాధ్యతలు చేపట్టారు.

'ఆలమూరు'కు సుబ్బరాజు బాధ్యతల స్వీకరణ

ఆలమూరు: మండలంలో విద్యాశాఖాధికారి(ఎంఈవో)-2గా పి.వెంకట సుబ్బరాజు మంగళవారం మండల బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఎంఈఓగా విధులు నిర్వహించిన డి.మురళి సత్యనారాయణ నిడదవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకి బదిలీ అయ్యారు. సీతానగరం మండలంలోని రఘుదేవపురం జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన వెంకట సుబ్బరాజు పదోన్నతిపై మండలానికి ఎంఈఓగా విచ్చేశారు. మండలంలోని ఖాళీగా ఉన్న ఎంఈఓ-1 పోస్టు త్వరలో భర్తీ కానుందన్నారు. ఎంఈఓ-2గా బాధ్యతలు స్వీకరించిన వెంకట సుబ్బరాజు స్థానిక ఎంపీడీఓ కె.జాన్‌లింకన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఆత్రేయపురానికి పచ్చా సాహెబ్

ఆత్రేయపురం: మండలానికి ఎంఈవో-2గా మహమ్మద్ పచ్చా సాహెబ్ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సాహెబ్‌కు ఎంపీడీఓ నాతిబుజ్జి, ఎంఈఓ వరప్రసాద్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారుల మనస్సు హత్తుకునేలా..

- అంగన్‌వాడీల్లో విద్యా బోధన
- జన్ భాగీదారీకి శ్రీకారం
- అవగాహన కోసం విస్తృతంగా ప్రచారం



ఆదుర్రు అంగన్‌వాడీలో జన్ భాగిదారీలో పాల్గొన్న సీడీపీఓ, స్థానికులు

మామిడికుదురు: చిన్నారుల జీవితంలో మొదటి ఆరేళ్లు ఎంతో విలువైనవి. మూడేళ్ల వరకు తల్లి ఒడికి, ఇంటికి పరిమితమయ్యే పిల్లలు తర్వాత బయట ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నాలు మొదలు పెడతారు.ఈ వయస్సులో చూపిన, విన్న అంశాల ఆధారంగా చిన్నారులు తమ బుద్ధిని, తెలివి తేటలను వికసింప చేసుకుంటారు. కావున పూర్వ ప్రాథమిక విద్యను చిన్నారులకు ఇష్టమైన ఆట, పాట, కథల ద్వారా వారి మనస్సులు హత్తుకునే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బోధించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఈ విధమైన విద్యా ప్రభావం పిల్లల్లో ప్రాథమిక స్థాయిలోనే కాకుండా ఉన్నత స్థాయిలో కూడా విద్యా ప్రమాణాలను అందించేందుకు దోహద పడుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇష్టమైన విధంగా బోధన చేసేందుకు జన భాగిదారి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనిపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వర్క్ బుక్స్, యాక్టివిటీ బుక్స్, స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాల ద్వారా పిల్లలకు ఆట పాటలతో విద్యను ఎలా అందిస్తున్నారో అవగాహన కల్పిస్తున్నారు.

మూడు ప్రాజెక్టులు... 622 కేంద్రాలు...

పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 622 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో మెయిన్ కేంద్రాలు 559 కాగా, 63 మినీ కేంద్రాలు ఉన్నాయి. పి.గన్నవరం ప్రాజెక్టు పరిధిలో 165 మెయిన్, 33 మినీ, రాజోలు ప్రాజెక్టు పరిధిలో 211 మెయిన్, 4 మినీ, కొత్తపేట ప్రాజెక్టు పరిధిలో 183 మెయిన్, 26 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో చిన్నారులను ఆకర్షించేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారు. చిన్నారుల వ్యక్తిత్వ మనో వికాసం పెంపొందించడం కోసం పలు ఆటలు ఆడిస్తున్నారు. క్రీడలకు సంబంధించిన వస్తువులతో ఆటలాడిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పట్ల చిన్నారులు ఆకర్షితులయ్యే విధంగా బోధన చేస్తున్నారు. ఈ విధానం ఎంతో బాగుందన్న ప్రశంసలు వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలు, విద్యా బోధనపై ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని చిన్నారులను కేంద్రాలకు పంపించే విధంగా సహకారం అందించాలని కోరుతున్నారు.

పేరెంట్స్‌లో చైతన్యం తీసుకు వస్తున్నాం



చిన్నారుల మనస్సులు హత్తుకునే విధంగా ఎన్నో ఆట వస్తువులు, కథల పుస్తకాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిపై పేరెంట్స్‌కు అవగాహన కల్పిస్తున్నాం. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాల్సిన ఆవశ్యకతను వివరించి తల్లిదండ్రులను చైతన్యవంతులను చేస్తున్నాం. జన భాగిదారీ కార్యక్రమం మంచి ఫలితాలనిస్తోంది.

– ఎస్.అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్, మామిడికుదురు

విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం



జన భాగిదారీపై విస్తృతంగా ప్రచారం చేపట్టాం. దీనిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పేరెంట్స్‌ను భాగస్వాములను చేస్తున్నాం. వారితో కలసి ర్యాలీలు నిర్వహిస్తున్నాం. చిన్నారుల మనస్సు హత్తుకునే విధంగా బోధన చేసే విధానాన్ని వివరిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ప్రతి ఒక్కర్ని కార్యోన్ముఖుల్ని చేశాం.

– ఎస్.సుబ్బలక్ష్మి, సూపర్‌వైజర్, ఐసీడీఎస్ ప్రాజెక్టు

చిన్నారుల భవిష్యత్తుకు పునాది



ఆరేళ్ల లోపు చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసే దిశగా చర్యలు చేపట్టాం. వారికి ఏ విధంగా బోధన చేసే వారి మనస్సుకు హత్తుకుంటుందో తెలుసుకుని దానికి అనుగుణంగా బోధన చేయిస్తున్నాం. వివిధ రకాల బోధన, అభ్యసన సామగ్రి తయారు చేయడంలో కిశోర బాలికలు, తల్లిదండ్రులను భాగస్వాములను చేశాం. ఇంటి దగ్గర చేయాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– వై.విజయశ్రీ, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు పి.గన్నవరం

జగనన్నతోనే ఇంటింటికీ సంక్షేమ లబ్ధి

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



కొత్తపేటలో లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా ఇంటింటికీ వివిధ పథకాల ద్వారా సంక్షేమ లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక 3 వ సచివాలయం పరిధిలోని సలాది స్వామినాయుడు మార్గ్, న్యూ బ్యాంక్ కాలనీ, ఓల్డ్ బ్యాంక్ కాలనీ ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాల వారికి వర్తించిన సంక్షేమ పథకాలు అందాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. కాంతి భారతి విద్యా సంస్థల తరఫున కరస్పాండెంట్ టి.సత్యవాణి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు పాఠశాల ముఖద్వారంలో జగ్గిరెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులకు ఘన స్వాగతం పలికారు. వారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే సీఎం జగన్ లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. తాజాగా విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించేందుకు జగనన్న ఆణిముత్యాలు పేరుతో నగదు ప్రోత్సాహకాలు అందజేస్తుందన్నారు. జగన్, తనపై మీరందరూ చూపుతున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మీ అభిమానం ఎప్పుడూ ఇలాగే ఉండాలమ్మా.. అని కోరారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల బ్రహ్మానందం, చావలి సుబ్బరాయశాస్త్రి, ఆలమూరు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, మండల యువజన విభాగం కన్వీనర్ గొల్లపల్లి స్వరూప్‌రాజ్, మండల సేవాదళ్ కన్వీనర్ గూడపాటి ప్రవీణ్‌కుమార్, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుర్రా శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తున్నాం.. ఆశీర్వదించండి

ఎమ్మెల్యే చిట్టిబాబు



జి.అగ్రహారంలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలను వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్ల కాలంలో ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందించి వారి మన్ననలు పొందుతున్నామన్నారు. ప్రతి గడపలోను పథకాలు పొందిన లబ్ధిదారులు మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని చెబుతున్నారన్నారు. పథకాల పంపిణీలో దళారీ వ్యవస్థ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. అవినీతిరహిత పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాలనీలో డ్రైనేజీలు నిర్మించాలని పింఛన్లు గృహ నిర్మాణాలు, రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే వద్ద వివరించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో అన్ని మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంతో పాటు ఇల్లు నిర్మించేందుకు జగన్ దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, మట్టపర్తి చంద్రశేఖర్, ఎంఎం శెట్టి, రాయుడు షణ్ముఖ్, విత్తనాల శేఖర్, మట్టపర్తి యజ్ఞశ్రీ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఇంటింటి సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీవల్లి

పి.గన్నవరం: కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈనెల 26 నుంచి వచ్చే నెల 16 వరకూ మండలంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్టు నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారిణి వై.శ్రీవల్లి తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఎంపిక చేసిన వలంటీర్లకు ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు. ఆశా వర్కర్, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న అనుమానితులను గుర్తించి ప్రభుత్వాస్పత్రులు పంపాలని సూచించారు. చర్మంపైన స్పర్శలేని రాగి రంగు ఉబ్బెత్తు మచ్చలు ఉండటం, నరాలు ఉబ్బి మందంగా తయారై స్పర్శ లేకపోవడం వంటి లక్షణాలు ఉన్న వారిని అనుమానితులుగా నమోదు చేయాలని అన్నారు. ఈ వ్యాధిని మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా నయం చేయవచ్చన్నారు. ఈ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. సమావేశంలో సీహెచ్‌ఓం ఎం.రవికుమార్, ఎంపీహెచ్ఈఓ ఎ.నాగరాజు, పీహెచ్ఎన్ ఏకే దుర్గాబాయి, కె.మేరీరత్నం, హెల్త్ సూపర్‌వైజర్ బీవీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల్లో మంగళవారం కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు, పి.ఉమ, సీహెచ్ బేబి తదితరులు కుష్టు వ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కుష్టు వ్యాధి రోగులను గుర్తించేందుకు నెల రోజుల పాటు సర్వే చేయాలన్నారు. ఆ సర్వేలో గుర్తించిన రోగులకు అందుబాటులోకి వచ్చిన డాట్ చికిత్సను అందజేయాలన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలన ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండాలని వైద్యాధికారులు పేర్కొన్నారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా అక్కుల పాల్గొన్నారు.

సీఎం లక్ష్యం ప్రజల వద్దకే పాలన..



కేశనపల్లిలో లబ్ధిదారునికి బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: ప్రజల వద్దకే ప్రభుత్వ పరిపాలన అనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. మంగళవారం మండలంలోని కేశనపల్లిలో గడప గపడకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రాపాక పాల్గొని ఇంటింటికీ పర్యటించారు. ప్రజల సమస్యలు, వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఏ పథకం అందుతుందని లబ్ధిదారులను ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ గడపగడపకూ కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేసి పనులు చేపట్టినట్లు వివరించారు. అంతేకాక రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. మనం చేసింది ప్రజలకు చెప్పమని, ఏం కావాలో ప్రజలను అడగమని సీఎం జగన్ ఎమ్మెల్యేలను ప్రజల వద్దకు పంపుతున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన కూడా జరగాలని భావించిన సీఎం జగన్ ప్రతి మండలానికి రెండేసి చొప్పున ప్రభుత్వాసుపత్రుల నిర్మిస్తున్నారని అన్నారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యెనుముల నారాయణ స్వామి, అడబాల కృష్ణారావు, సుంకర బాబ్జి, యర్రంశెట్టి గోపాలకృష్ణ, యడ్ల వెంకటరమణ, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ, గుండుమేను నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోదీ హయాంలో దేశానికి పెట్టుబడుల వరద

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురంధేశ్వరి



ముక్తేశ్వరం సభలో మాట్లాడుతున్న బీజేపీ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురంధేశ్వరి

అయినవిల్లి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన మేక్ ఇన్ ఇండియా నినాదంతో మన దేశానికి పెట్టుబడులు వరదలా వస్తున్నాయని బీజేపీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి, రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ పీవీఎల్ మాధవ్ అన్నారు. మంగళవారం అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవ సభకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సభ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అధ్యక్షత వహించగా పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రతి నాలుగు నెలలకోసారి రైతులకు రూ.2 వేలు ఇస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్రాంత అభివృద్ధిని ఎవరూ నిరోధించలేరన్నారు. పీఎం మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఎటువంటి అవినీతికి తావు లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం వేరే పథకాలకు మళ్లిస్తుందన్నారు. రాష్ట్రానికి కేంద్రం ప్రత్యేకహోదా ద్వారా వచ్చే నిధుల కన్నా ఎక్కువ నిధులు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కోటిపల్లి నుంచి నర్సాపురం వరకూ రైల్వే ట్రాక్ కోసం రూ.1100 కోట్ల నిధులు ఇచ్చిందన్నారు. కత్తిపూడి నుంచి పామర్రు వరకూ నేషనల్ హైవేను కేంద్ర ప్రభుత్వమే నిర్మిస్తుందన్నారు. ఆర్థిక లోటు కోసం ఇటీవల కేంద్రం రాష్ట్రానికి రూ.10 వేల కోట్లు విడుదల చేసిందన్నారు. అన్ని రకాలుగా నిధులిచ్చి రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదుకుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.12 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో పొత్తుల విషయం పార్టీ అగ్ర నాయకులు చేతుల్లో ఉందన్నారు. ఒక జనసేన పార్టీతో మాకు ఇప్పటివరకూ పొత్తు ఉందన్నారు. బూత్, మండల, జిల్లా స్థాయిలో పార్టీ బలోపేతమే తమ లక్ష్యమన్నారు. తొలుత దగ్గుబాటి పురంధేశ్వరి అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రమైన ముక్తేశ్వరంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయ్యాజీ వేమా, యాళ్ల దొరబాబు, ఆకుల వీరబాబు, విళ్ల దొరబాబు, కుడుపూడి చంద్రశేఖర్, కొపనాతి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అభినందనీయం

సఖినేటిపల్లి: స్థానిక గీతామందిరం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సేవాభావం అభినందనీయమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం పాఠశాలలో 1998–99లో పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల విరాళాలు రూ.4 లక్షలతో నిర్మించిన కళావేదికను ఎమ్మెల్యే ప్రారంభించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీలు రాపాక దీవెనకుమారి, రుద్రరాజు చినరాజా, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, ఎంపీటీసీ నల్లి రత్నకుమార్, నాయకులు రుద్రరాజు రంగరాజు, జాన శంకరరరావు, కుసుమ చంద్రశేఖర్, హెచ్ఎంలు కె.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉపాధిహామీ సిబ్బందితో ఎంపీడీఓ నాతిబుజ్జి సమీక్ష సమావేశం నిర్వహించారు. లేబర్ బడ్జెట్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఉద్యాన శాఖకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కె.విజయభారతి, ఈసీ చక్రపాణి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ అడ్మిషన్లు

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు తెలిపారు. ఆ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నత విద్యాశాఖ సంచాలకుల ఉత్తర్వులను అనుసరించి సోమవారం నుంచి ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు కాలేజీకి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కళాశాలలో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అడ్మిషన్ల కోసం కళాశాలకు వచ్చే విద్యార్థులకు వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి

రావులపాలెం: మహిళా పాల ఉత్పత్తిదారులు సహకార సంఘంగా ఏర్పడి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం రావులపాలెం పంచాయతీ వద్ద సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి అధ్యక్షతన జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సచివాలయం-1 పరిధిలో ఉన్న 16 మంది మహిళా పాల ఉత్పత్తిదారుల్లో సహకార సంఘం ఏర్పాటు చేసి 11 మందితో సంఘాన్ని ఏర్పాటు చేశారు. చీఫ్ ప్రమోటర్‌గా కర్రి ధనలక్ష్మి, ప్రమోటర్‌గా కొవ్వూరి భవానీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పశుబీమాతో పాడి రైతుకు ధీమా

అంబాజీపేట: వైఎస్సార్ పశుబీమా పథకాన్ని పశు పోషకులందరూ సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ పి.గన్నవరం ఏడీఏ పి.విజయరెడ్డి అన్నారు. మొసలపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ కట్టా గోపాలకృష్ణగోఖలే అధ్యక్షతన పశు బీమా పథకంపై రైతులకు అవగాహనను మంగళవారం కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ ఉత్పాదక దశలో ఉన్న ఒకసారి ఈనిన 2–10 సంవత్సరాల వయసు గల ఆవులు, 3–12 సంవత్సరాల వయసు గల గేదెలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఏడాదిన్నర వయసు పైబడిన మేలు జాతి సంకర జాతి ఆవులు, గేదెలకు కూడా వర్తిస్తుందన్నారు. రెండేళ్ల వయసు పైబడిన నాటు ఆవులు, గేదెలకు కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఆరు నెలలు ఆపై వయస్సు గల గొర్రెలు, మేకలు, పందులకు కూడా వర్తిస్తుందన్నారు. పుల్లేటికుర్రు వైద్యాధికారి డి.శ్రీనివాస్, ఏహెచ్ఏ భగవాన్ పాల్గొన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

మలికిపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ పశు బీమా పథకంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మలికిపురం పశు సంవర్ధక శాఖ ఏడీ ఎస్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. లక్కవరంలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా పంటలు పోతాయి తప్ప రైతులకు నికర ఆదాయం పశువుల పెంపకంతోనే సాధ్యమని ఆయన అన్నారు. అంతేకాక ప్రమాదవశాత్తూ మరణించిన పశువులకు బీమా లభిస్తుందని అన్నారు. బీమాలో 80 శాతం ప్రభుత్వం చెల్లిస్తుందని 20 శాతం మాత్రమే రైతు చెల్లించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో రైతులు ఏడీని సన్మానించారు. వైద్యాధికారి ఎస్.శివకుమార్, ముదునూరి సత్య సీతారామరాజు, విష్ణుమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలు సక్రమంగా సేకరించండి

అంబాజీపేట: ప్రతి ఆర్బీకే పరిధిలో మట్టి నమూనాలను సక్రమంగా సేకరించాలని జాప్యం చేయవద్దని మండల వ్యవసాయాధికారి(ఏవో) సీహెచ్‌డీ విజయ్ కుమార్ అన్నారు. అంబాజీపేట మండలంలోని ఆయా ఆర్బీకే పరిధికి చెందిన గ్రామాల్లో వీఏఏలు, వీహెచ్ఏలు సేకరిస్తున్న మట్టి నమూనాలను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలో 430 మట్టి నమూనాలను సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 260 వరకు సేకరించామన్నారు. మట్టి పరీక్షల వల్ల భూమిలో పోషకాలు, నత్రజని, భాస్వరం, పొటాష్ నిల్వలు తెలుసుకోవచ్చన్నారు. భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఏ మేరకు ఎరువులు వాడాలో రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. భూసార పరీక్షలు చేయించుకునేందుకు రైతులు ముందుకు వచ్చి సహకరించాలన్నారు.

సాగు నీటి సమస్యను పరిష్కరించాలి

అంబాజీపేట: వరి నారుమడుల సమయంలో సాగు నీటి సమస్యను పరిష్కరించేలా వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులు సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ప్రసాద్‌లను ముందస్తుగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. పుల్లేటికుర్రులో చౌడేశ్వరి ఆలయం వద్ద వ్యాఘ్రేశ్వర ఐక్య రైతు సంఘ సమావేశం అధ్యక్షుడు కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. మద్యం సీసాలను వరి చేలల్లో వేస్తున్నారని దీని వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అంబాజీపేట ఎస్సైతో చర్చించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చేలా నిర్ణయించామని ప్రసాద్ తెలిపారు. అలాగే బహిరంగ మలవిసర్జన చేలల్లో, గట్ల వద్ద చేయకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, సర్పంచ్ జల్లి బాలరాజు ఆధ్వర్యంలో మైక్ ప్రచారం చేసేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. సమావేశంలో సంఘ కార్యదర్శి అడబాల రాజారావు, ఉపాధ్యక్షుడు అయ్యగారి శ్రీనివాసరావు, అయ్యగారి సుబ్రహ్మణ్యం, బులుసు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగం అధ్యక్షుడిగా బాబి



సూరిశెట్టి బాబి

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా మగటపల్లి గ్రామానికి చెందిన సూరిశెట్టి బాబిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఈ సందర్భంగా బాబిని మంగళవారం పలువురు పార్టీ నాయకులు అభినందించారు. తనను జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌తో పాటు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులకు బాబి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని, పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు.

పాలవెల్లువతో అదనపు ఆదాయం

అయినవిల్లి: పాలవెల్లువతో మహిళలకు అదనపు ఆదాయం లభిస్తుందని ఎంపీడీఓ తాడి శ్రీ వెంకటాచార్య అన్నారు. మంగళవారం మండలంలో కొండుకుదురు, నేదునూరు గ్రామ పంచాయతీల్లో మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులతో పాలవెల్లువపై అవగాహన సదస్సును నిర్వహించారు. పాలవెల్లువ యూనిట్ల ఏర్పాటు కోసం మహిళా కమిటీలను నియమించారు. కార్యక్రమంలో ఏపీఓ దుర్గ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Sri BODDAPALLI VENKATANARAYANA, ... Smt. BODDAPALLI NAGAMANI ... VENKATANARAYANA ... SHRIRAM FINANCE LTD. ... SCHEDULE ...

M. RAVI RAM, Smt. M. SRIDEVI
Advocates ... Razole